క్లుప్తంగా

సిద్ధమైన జూ పార్క్ బస్ బే



జూ పార్కు ముందు నిర్మించిన బస్ బే

ఆరిలోవ: నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం జీవీఎంసీ ఆధునిక బస్ బేలను కొన్నాళ్లుగా నిర్మిస్తోంది. ఇందులో భాగంగా జూ పార్కుకు వెళ్లే సందర్శకుల కోసం బస్ బే నిర్మాణం చేపట్టింది. జాతీయ రహదారిని ఆనుకొని జూ ప్రధాన ద్వారం పక్కన ఇటీవల జీవీఎంసీ అధికారులు బస్ బే నిర్మించారు. అధికారకంగా ప్రారంభానికి ఇక్కడ బస్ బే సిద్ధమైంది. ఇక్కడ షెల్టర్‌లో కిందన గచ్చు, లోపల ప్రయాణికులు కూర్చోవడానికి వీలుగా నిర్మాణం చేపట్టారు. గతంలో ఇక్కడ బస్ షెల్టర్ లేకపోవడంతో జూ పార్కుకు వెళ్లే సందర్శకులు ఇబ్బంది పడేవారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని జూ అధికారులు ఇటీవల ఇక్కడ బస్ బే నిర్మించాలని కోరుతూ జీవీఎంసీకి లేఖ రాశారు. దీనికి స్పందించిన అధికారులు బస్ బే నిర్మించారు. దీంతో జూ పార్కుకు వెలుతున్న సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా దేబస్నాన పూర్ణిమ



పూజలు చేస్తున్న జె.కె.నాయక్

బీచ్‌రోడ్డు : జగన్నాథ ధామ్ పూరీ ఆచారాన్ని అనుసరిస్తూ దసపల్లా హిల్స్‌లోని ఉత్కళ్ సంస్కృతీ సమాజ్‌లో శనివారం ఘనంగా దేబస్నాన పూర్ణిమ (స్నాన యాత్ర) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శ్రీ జగన్నాథుడు, శ్రీబలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ సుదర్శన చక్ర దేవతలకు సువాసనతో కూడిన 108 కుండల నీటిని గర్భగుడిలోకి యాత్రగా తీసుకెళ్లారు. ఈ యాత్రకు వందలాది మంది భక్తులు విచ్చేసి అన్నప్రసాదాలు స్వీకరించారని ఉత్కళ్ సమాజ్ అధ్యక్షుడు జె.కె. నాయక్ తెలిపారు. 14 రోజుల పాటు రాత్రి సమయంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అనసారా స్నానం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్ సాహు, బిమల్‌కుమార్ మహంత్ తదితరులు పాల్గొన్నారు.

'నెక్స్‌జెన్ ఎంపరివాహన్' యాప్‌పై అవగాహన



వాహన చోదకులకు యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటరావు

మద్దిలపాలెం: మద్దిలపాలెం కూడలిలో శనివారం వాహన చోదకులకు నెక్స్ట్‌జెన్ ఎంపరివాహన్ సిటిజన్ యాప్‌పై ట్రాఫిక్ సీఐ కె.ఎస్.ఎస్.వి.వెంకటరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క వాహన చోదకుడు ఈ యాప్‌ను సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవడం ద్వారా వాహన ధ్రువీకరణ పత్రాలతోపాటు బకాయి చలానులు తెలుసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.వి.భాస్కర్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

బీచ్‌రోడ్డు : తోటి ఉద్యోగి అకాల మరణం చెందటంతో ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు మిగిలిన ఉద్యోగులు నడుం బిగించారు. మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 2009 బ్యాచ్‌కు చెందిన సన్యాసిదొర హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆయన ఈ ఏడాది జనవరిలో అకాల మరణం చెందారు. దీంతో ఆ బ్యాచ్‌కు చెందిన తోటి ఉద్యోగులు సన్యాసిదొర కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. అంతా కలిసి రూ. 5.20 లక్షలు సేకరించి మృతుని కుటుంబ సభ్యులకు శనివారం మూడో పట్టణ పోలీసు స్టేషన్‌లో అందజేశారు.

మత్తు పదార్థాల జోలికి పోవద్దు

యువతకు ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు సూచన



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు

ఆరిలోవ: మాదక ద్రవ్యాల వాడకంతో యువత తప్పుదోవ పడుతోందని ద్వారకా జోన్ ఏసీపీ రాంబాబు తెలిపారు. తోటగరువు దరి ఎర్ని దుర్గమాంబ ఆలయ ప్రాంగణంలో శనివారం స్థానిక ఆటో డ్రైవర్లు, సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించి మత్తు పదార్థాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరిలోవలో అన్ని రకాల అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. నమోదు అవుతున్న ప్రతి నేరంలోను ఆరిలోవ ప్రాంతానికి చెందిన వ్యక్తులు ఉంటున్నారన్నారు. దీంతో పాటు ఈ ప్రాంతంలో మాదక ద్రవ్యాల వినియోగం విచ్చలవిడిగా జరుగుతోందని తెలిపారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాల వల్ల ఆరోగ్యం పాడవడంతో పాటు బంగారు భవిష్యత్ నాశనమవుతుందని తెలిపారు. ఇంట్లో పిల్లలు మత్తు పదార్థాలు, సెల్ ఫోన్లకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలన్నారు. ఈ విషయంలో స్థానికులు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఆటో డ్రైవర్లకు సూచనలు..

ఆటోలు ఎక్కే పాసింజర్ల మూటలను ఆటో డ్రైవర్లు గమనించాలని ఏసీపీ సూచించారు. గంజాయితో ఆటో ఎక్కేవారి ఆచూకీ పోలీసులకు తెలియజేస్తే తెలిపిన వారికి పారితోషికం అందించి సత్కరిస్తామన్నారు. ఆటో డ్రైవర్లు ప్రమాదాలకు కారకులు కాకుండా సక్రమంగా వ్యవహరించాలన్నారు. అనంతరం 10వ వార్డు కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఒమ్మి సన్యాసిరావు మాట్లాడుతూ ఆరిలోవలో గంజాయి బ్యాచ్‌లను నిర్మూలించాలని పోలీసులను కోరారు. పోలీసులకు తాము సహకరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరిలోవ సీఐ జి.గోవిందరావు, పలువురు ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'అపోలో'లో గుండె జబ్బుకు అరుదైన శస్త్రచికిత్సలు



అపోలో వైద్యుల సమక్షంలో మాట్లాడుతున్న పేషెంట్ బంధువు

ఆరిలోవ: హెల్త్ సిటీ అపోలో ఆస్పత్రిలో వైద్యులు ఇటీవల గుండె వ్యాధికి సంబంధించి ఇద్దరు వ్యక్తులకు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఆస్పత్రిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కార్డియాక్ కన్సల్టెంట్ డాక్టర్ బారువ మాట్లాడుతూ గుండె సంబంధిత వ్యాధులకు అరుదైన శస్త్ర చికిత్స చేసినట్లు తెలిపారు. 63 ఏళ్ల వయసు గల ఓ వైద్యుడు ఎల్వీ సిస్టోలిక్ డిస్‌ఫంక్షన్‌తో తీవ్రమైన కాల్సిఫిక్ ఆర్టిక్ స్టెనోసిస్‌తో కొన్నాళ్లుగా బాధపడేవారన్నారు. ఈ వ్యాధితోపాటు ఆయనకు మూత్రపిండాల వ్యాధి, పెరిఫెరల్ వాస్కులర్ వ్యాధి కూడా ఉండేవని చెప్పారు. ఆయనకు ఇక్కడ నూతన పద్ధతిలో గుండె వైద్యుల బృందంతో కలసి బృహద్ధమని కవాటం ట్రాన్స్‌కాథెటరీ రీప్లేస్‌మెంట్‌ను విజయవంతంగా చేసినట్లు తెలిపారు. ఇప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నారన్నారు. మరో 72 ఏళ్ల వయసు గల మహిళ బృహద్ధమని సంబంధిత స్టెనోసిస్ వ్యాధితో తీవ్రమైన బాధపడేవారన్నారు. ఆమెకు స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ చికిత్స విధానంతో సర్జరీ చేశామన్నారు. ఆయా వ్యక్తులకు చేసిన రెండు శస్త్రచికిత్సలు విజయవంతమయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా సర్జరీలు జరిగిన వ్యక్తులు, వారి బంధువులు మాట్లాడుతూ శస్త్రచికిత్సతో ఆరోగ్యంతో ఉన్నట్లు ఆనందం వ్యక్తం చేశారు. ఆయా శస్త్రచికిత్సలు చేసిన బృందంలో డాక్టర్ కిశక్షర్ పాణిగ్రహి, డాక్టర్ త్రివేది, డాక్టర్ చక్రధర్, డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రవికాంత్, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ సునీల్, డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

సీతమ్మధార: ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం సాయంత్రం వాహన చోదకులకు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరంగా నిర్వహించారు. ఎస్ఐ భాస్కరరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు చేశారు. సాయంత్రం వేళల్లో మద్యం తాగి వాహనాలు నడుపుతూ రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్న చోదకులకు జరిమానాలు విధించారు. ఆశీలమెట్ట, ద్వారకానగర్, గురుద్వారా, సీతంపేట తదితర జంక్షన్ల వద్ద పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ భాస్కరరావు మాట్లాడుతూ వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలని సూచించారు.

జల సంరక్షణకు శ్రీకారం



వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న వరప్రసాద్

మురళీనగర్: నగరంలో భూగర్భ జలాల పునరుద్ధరణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్స్(ఏపీ ఫెర్వాస్) అధ్యక్షుడు ఉదయ్ షిర్‌నామే తెలిపారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణాన్ని చేపట్టారు. మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్ ఇంకుడు గుంత నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా షిర్‌నామే మాట్లాడుతూ నగరంలోని అన్ని పార్కుల్లోనూ ఇంకుడు గుంతల నిర్మాణానికి అయ్యే ఖర్చు తమ సంఘం భరిస్తుందని తెలిపారు. కాంక్రీట్ జంగిల్ పెరుగుతున్న నేపథ్యంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా జల సంరక్షణకు శ్రీకారం చుట్టడం హర్షణీయమని సనపల వరప్రసాద్ అన్నారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కె.ఎస్.ఆర్. మూర్తి, ప్రధాన కార్యదర్శి ఎం.దుర్గాప్రసాద్, జోన్–5 కో ఆర్డినేటర్ కర్రి శేషగిరిరావు, వనితా వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి పాల్గొన్నారు.

సమస్త శక్తుల సమాహారం మహాకాళి



ప్రవచిస్తున్న రమ్యానందభారతీ స్వామిని

సీతంపేట: లలితానగర్ శ్రీలలితా పీఠంలో జరుగుతున్న గురుదేవుల ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం త్రిశక్తి వైభవంపై శ్రీశక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతీ స్వామిని ప్రవచనం చేశారు. దేవీ భాగవతం, కాళీ పురాణంలో అమ్మవారి వైభవ విశేషాలు ఉన్నాయని తెలిపారు. కాళీ రూపంలో అమ్మవారు పరమేశ్వరుడికి ప్రియమైన స్వరూపమని, శివశక్తి అభేద్యమని, కాళీమాత వాక్శక్తినిచ్చే దేవతని, సమస్త శక్తుల సమాహారమైన మహాకాళి అని కాళీతత్వాన్ని వివరించారు. మాత అలంకారాలను, ఆయుధాలను, శక్తులను, విశిష్టతను వివరించారు. కుర్తాళం శంకరాచార్య సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి సమక్షంలో జరిగిన ఈ ప్రవచన కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేశారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కేవీ నూతన ఉపాధ్యాయులకు శిక్షణ



శిక్షణ తరగతులకు హాజరైన నూతన ఉపాధ్యాయులు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం శ్రీవిజయనగర్‌లోని కేంద్రీయ విద్యాలయం–2లో సంఘటన్ ద్వారా నూతనంగా ఎంపికైన హైదరాబాద్ రీజియన్‌కు చెందిన ఉమ్మడి జిల్లాలోని వివిధ కేంద్రీయ విద్యాలయాల్లో నియమితులైన నూతన ఉపాధ్యాయులకు శనివారం శిక్షణ తరగతులు ప్రారంభించారు. ముఖ్య అతిథిగా ఈస్టర్న్ నేవల్ కమాండ్, విద్యాలయ మేనేజింగ్ కమిటీ చైర్మన్ కమాండర్ రజత్ నాగ్‌పాల్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. విద్యాలయ సంఘటన్ మిషన్, ఆశయాలు, నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ అనుసరణ, నిపుణ్ భారత్, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్ వర్క్, పాఠశాలలో ఉపాధ్యాయుల ప్రవర్తనా నియమావళి, సమగ్ర విద్యా పరిపాలన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ 26వ వరకు శిక్షణ ఉంటుందని పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసులు తెలిపారు. పాఠశాల విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కార్యక్రమంలో కేవీ–1 ప్రిన్సిపాల్ మదీనా మాలిక్, సాహిత్య, జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో ఏరువాక పౌర్ణమి వేడుకలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. ఆలయ అర్చకుడు శేషాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు వివిధ సుగంధ ద్రవ్యాలతో స్వామికి పంచామృతాభిషేకం నిర్వహించారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా 108 వెండి కలశాలతో శ్రీగంధం జలాలను తీసుకువచ్చి స్వామికి కలశాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు స్వామి నిజపాద దర్శనం కల్పించారు. 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేశారు. సాయంత్రం వైభవుడికి నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కేకే లైన్‌లో జీఎం తనిఖీలు



కోరాపుట్ రైల్వే స్టేషన్‌లో పర్యటిస్తున్న ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్



అరకు–కొత్తవలస సెక్షన్ మధ్య బ్రిడ్జి, టన్నెల్‌లను పరిశీలిస్తున్న జీఎం పరమేశ్వర్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ కేకే(కొత్తవలస–కోరాపుట్) లైన్‌లో శనివారం ఈస్ట్ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్‌వాల్ తనిఖీలు నిర్వహించారు. ఈ మార్గంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నిర్వహణా సామర్థ్యం, ప్రయాణికుల సదుపాయాలతోపాటు రెండో లైన్ పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. ముందుగా రైల్ వినియోగదారులు, భాగస్వాములైన ఎన్ఎండీసీ వంటి కంపెనీల ప్రతినిధులతో సమావేశమై రైల్వే అభివృద్ధి కోసం పరస్పరం సహకరించుకోవాలని, దీని ద్వారా ఇరువర్గాలు లబ్ధి పొందుతాయని జీఎం సూచించారు. ఈ మార్గంలో గల కోరాపుట్, అరకు, శివలింగపురం స్టేషన్లలో పర్యటించి, అక్కడ జరుగుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం విండో ట్రయలింగ్ ద్వారా నిర్మాణంలో ఉన్న డబ్లింగ్ లైన్, గుహలు, మలుపులు, క్రాసింగ్స్, పాయింట్స్, వంతెనలను కూడా తనిఖీ చేశారు. పర్యటనలో డివిజనల్ రైల్వే మేనేజర్ సౌరభ్ ప్రసాద్, చీఫ్ ట్రాక్ ఇంజినీర్ కె.ధనుంజయరావు, చీఫ్ ఫ్రైట్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ దిబ్బంజన్ రాయ్, ఇతర ఉన్నతాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు పాత అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. వారం రోజుల పాటు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా ఈ ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరి రోజు శనివారం ఉదయం ఆరు గంటల ఉంచి ఆరాధన, పారాయణం, నిత్య హోమం, మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ, నవకలశ పూజ, చక్రస్నానం జరిపించారు. సాయంత్రం విష్వక్సేన పూజ, పుష్పయాగం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వేదపండితులను ఆలయ కమిటీ ఘనంగా సత్కరించింది. ఆలయ ధర్మకర్త ఇ.కె. చారి దంపతులు, కమిటీ ప్రతినిధులు సాయిబు నాయుడు, నరసింగరావు, గురనాథరావు, కృష్ణారావు, సత్యనారాయణ, మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, సోమశేఖర్, గొల్లవిల్లి వెంకటరావు పాల్గొన్నారు.

అలరించిన సంగీత విభావరి

సీతంపేట: పద్మభూషణ్ డాక్టర్ చిరంజీవి కళా పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. గాయనీ గాయకులు సినీగీతాలు ఆలపించి ప్రేక్షకులను అలరించారు. ఈ సందర్భంగా కళా పరిషత్ వైజాగ్ అధ్యక్షుడు గెంబలి జగదీష్‌ను ఉపకార్ ట్రస్టు ఎండీ కంచర్ల అచ్యుతరావు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జాతీయ జర్నలిస్టుల సంఘం నాయకులు గంట్ల శ్రీనుబాబు, సకల కళాకారుల సంఘం నాయకులు చెన్నా తిరుమలరావు, సినీ మా అసోసియేషన్ సభ్యులు భయ్యా శ్రీనివాస్, లోకేశ్వరరావు, శ్రీదేవి మహానటి సాంస్కృతిక సేవా సంస్థ ప్రతినిధి అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

అనధికార బడ్డీల తొలగింపు



విశాలాక్షినగర్‌లో అక్రమంగా వెలసిన బడ్డీలను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు విశాలాక్షినగర్‌లో అనధికారిక బడ్డీలను జోన్–2 టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం తొలగించారు. ఇటీవల ఇక్కడ కొందరు స్థానిక నాయకులు బడ్డీలు ఏర్పాటు చేసి వ్యాపారులకు విక్రయించేశారు. జోడుగుళ్లపాలెం నుంచి వైఎస్సార్ సీవ్యూ పాయింట్(సీతకొండ బీచ్)కు వెళ్లే బీచ్ రోడ్డును ఆనుకొని విశాలాక్షినగర్ మలుపు వద్ద ఇటీవల కొందరు అనధికారికంగా వరుసగా 10 బడ్డీలు ఏర్పాటు చేశారు. వాటిని కొందరు అద్దెలకు ఇస్తుండగా, మరికొందరు విక్రయాలకు పెట్టారు. వీటిని రోడ్డు పక్కన ఏర్పాటు చేయడం వల్ల స్థానికులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. అక్కడ ఫాస్ట్‌ఫుడ్‌తోపాటు మత్తు పదార్థాలు, సిగరెట్లు, ఖైనీ ప్యాకెట్లు సైతం విక్రయించేవారు. దీంతో ఇక్కడ ప్రతి రోజు సాయంత్రం సమయంలో హడివుడిగా మారుతోంది. వాహన చోదకులు అటుగా వెళ్లడానికి భయపడేవారు. దీనిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేశారు. స్పందించిన అధికారుల ఆదేశాలతో గత నెల 31న జోన్–2 టౌన్ ప్లానింగ్ సిబ్బంది పొక్లెయిన్‌లతో అక్కడ ఉన్న 10 బడ్డీలను తొలగించి బీచ్ రోడ్డు పక్కన శ్మశాన వాటికలో పడేశారు. అయినా ఆగకుండా వాటిని వాటి నిర్వాహకులు మళ్లీ శుక్రవారం రాత్రి తీసుకువచ్చి రోడ్డు పక్కన ఏర్పాటు చేశారు. శనివారం నుంచి యథావిధిగా వ్యాపారాలు ప్రారంభించేశారు. దీంతో మరోసారి వాటిపై స్థానికులు జీవీఎంసీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది, జేసీబీతో వెళ్లి ఆ బడ్డీలను తొలగించారు. ఈసారి బడ్డీలు రోడ్డు పక్కన ఏర్పాటు చేస్తే కఠిన చ్యలు తప్పవని హెచ్చరించారు.

సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎం.వి.ఆర్. రాజు



వీసీ నుంచి ఉత్తర్వులు స్వీకరిస్తున్న ఎం.వి.ఆర్. రాజు. ఆచార్య పద్మశ్రీ

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా సైకాలజీ విభాగ ఆచార్యులు ఎం.వి.ఆర్. రాజు నియమితులయ్యారు. శనివారం ఆచార్య కె.శ్రీనివాసరావు నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాజును ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అభినందించారు. ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్‌గా కెమికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు ఆర్.పద్మశ్రీ నియమితులయ్యారు. శనివారం సాయంత్రం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెను ఏయూ వీసీ, రిజిస్ట్రార్ అభినందించారు.

వ్యాధుల వివరాల నమోదు తప్పనిసరి

• డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూలకు సంబంధించిన రిపోర్టులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ యాప్‌లో అప్‌లోడ్ చేసి జిల్లా మలేరియా అధికారిని సంప్రదించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. శనివారం తన కార్యాలయంలో ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల యాజమాన్యాలతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం అనంతరం జిల్లాలో ×స్టాప్ డయేరియా×ఆదేశాలు జారీ అయ్యాయని తెలిపారు. ఐఆర్‌పీడీ యాప్ అప్‌లోడ్ గురించి తెలిపారు. అంతే కాకుండా పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్, ఫారం–ఎఫ్ అప్‌లోడింగ్, రిజిస్ట్రేషన్, రెన్యువల్స్ తదితర వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందజేయాలని ఆదేశాలు జారీ చేశారు. అన్ని ఆస్పత్రులు రెన్యువల్స్, రిజిస్ట్రేషన్స్ తప్పనిసరిగా చేయాలన్నారు. ఫారం–ఎఫ్ ఆన్‌లైన్‌లో విధిగా అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఎక్కువగా సాధారణ కాన్పులు చేయాలని, సాధ్యమైనంత వరకు సి–సెక్షన్ ప్రసవాలు తగ్గించాలని తెలిపారు. జిల్లా మలేరియా అధికారి డాక్టర్ తులసీరాజ్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వ్యాధులకు సంబంధించిన రిపోర్టులు తెలియజేసేటప్పుడు రోగుల ఆధార్ కార్డు, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. దాని వలన రోగిని సులభంగా గుర్తించి మెరుగైన వైద్య సేవలందించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ జగదీష్ ప్రసాద్, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐఆర్‌పీడీ మెడికల్ అధికారి డాక్టర్ ఎ.యామినీకాంతి, జిల్లా గణాంక అధికారి మురళీకృష్ణ, జిల్లా నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, ఆరోగ్యశ్రీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డే ఉత్సవాలు



లాస్ క్రూసెస్ నగరంలో అగ్నిహోత్ర క్రతువు నిర్వహిస్తున్న సత్యదేవ్



స్పెయిన్‌లో సాధక బృందంతో చంద్రశేఖర గురుప్రసాద్

తాటిచెట్లపాలెం: లోకహితార్థం జీవించిన పరమ గురువుల బోధనలు, వారు చూపిన మార్గం నేడు భౌగోళికంగా వ్యాప్తి చెందాయని ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ (జగద్గురు పీఠం) డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ తెలిపారు. మాస్టర్ సి.వి.వి. తన యోగ మార్గాన్ని ఉపదేశించిన మే 29న ప్రతీ ఏటా మే కాల్ డేగా పాటిస్తారు. 1910లో ప్రప్రథమంగా కుంభకోణంలో మాస్టర్ సి.వి.వి. మే కాల్ డేను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యదేవ్ ఇటీవల యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికాలో నిర్వహించిన తన 4వ యాత్రను ముగించుకుని నగరానికి చేరుకున్నారు. మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో శనివారం పలు విషయాలను ఆయన వెల్లడించారు. అమెరికాలోని న్యూ మెక్సికో రాష్ట్రంలో గల లాస్ క్రూసెస్, థావోస్, డల్లాస్ నగరాల్లో మే కాల్ డే సందర్భంగా ఉత్సవాలు, సత్సంగాలు, పూజాది క్రతువులను జరిపానని చెప్పారు. మాస్టర్ సి.వి.వి. ప్రార్థన, యోగ మార్గంపై విదేశీయులు ఆసక్తి చూపుతున్నారని, మాస్టర్ ఇ.కె.రచనలు వారికి మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు రాసిన అనేక గ్రంథాలు జర్మనీ, స్పెయిన్ దేశాల్లో వారి వారి భాషల్లో అనువాదమై, పాశ్చాత్యుల ఆధ్యాత్మిక సాధనకు ఉపయోగపడుతున్నాయని వివరించారు. ప్రాక్పశ్చిమ ఆధ్యాత్మిక సమన్వయానికి నాడు మాస్టర్ ఇ.కె., మాస్టర్ పార్వతీకుమార్‌లు చేసిన విదేశీయాత్రలు నేడు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. ట్రస్ట్ భౌగోళిక అధ్యక్షుడు కె.చంద్రశేఖర గురుప్రసాద్ ఇటీవల స్పెయిన్, జర్మనీ దేశాల్లో 15 రోజులు పర్యటించి పలు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు. మాస్టర్ సి.వి.వి. 115వ మే కాల్ డేను నిర్వహించారని, ఆయా దేశాల్లో అగ్నిహోత్రాది క్రతువులను కూడా నిర్వహించినట్లు సత్యదేవ్ చెప్పారు.